# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-09-2017** **సమయం : 1.20 గంటలు**

1. **50 ఏళ్ళలోపు సాధారణ మరణం సంభవించిన నిరుపేదలకు 2 లక్షల రూపాయలు చంద్రన్న బీమా చెల్లించే పథకాన్ని అక్టోబర్ 2వ తేదీ గాంధీజయంతి రోజు ప్రారంభిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విజయవాడలో ఈ రోజు ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.**

2. **ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్దేశిత లక్ష్యానికి మించి 103 శాతం ఆదాయాన్ని ఆర్జించినట్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి తెలిపారు.**

3. **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ 36వ సంచిక ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది.**

4. **ఎలక్ట్రానిక్స్, అణు, భౌతిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన అయ్యగారి సాంబశివరావు జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ రోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

================

జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధించగలమని.... ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని లబ్ధిదారులందరికి అందింటమే ప్రభుత్వ లక్ష్యమని ఆంద్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విజయవాడలో ఈ రోజు ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల 13వ సదస్సులో ఆయన పాల్గొని కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లడుతూ..

..వాయిస్ 50 సెకన్స్

------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ ఏడాది తొలి త్రైమాసికానికి 11.72 శాతం వృద్ధి రేటు సాధించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, సుస్థిర అభివృద్ధి సాధన అంశంపై ఐక్యరాజ్యసమితిలో మాట్లాడే అవకాశం మన రాష్ట్రానికి దక్కడం ప్రభుత్వ సమర్ధ పాలనకు నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కే.ఈ క్రిష్ణమూర్తి మూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 4 వేల కోట్లరూపాయల ఆదాయం లక్ష్యంగా పనిచేసిన

రిజిస్ట్రేషన్ శాఖ ఆగస్టు మాసాంతానికి నిర్దేశిత లక్ష్యానికి మించి 103 శాతం ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలిపారు. విజయవాడలో జరుగుతున్న జిల్లా కలెక్టర్సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాల ఆధునీకీకరణలో భాగంగా తొలి దశలో 105 తాహశీల్దార్, 8 ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్న ఆయన రెవెన్యూ అధికారులలో నైపుణ్యం పెంచేందుకు సామర్లకోటలో  రెవెన్యూ, సర్వే శాఖ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ధృవీకరణ పత్రాలన్నీ ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. భూరికార్డుల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు 735 డేటా సెంటర్లను ఏర్పాటు చేశామన్న మంత్రి చుక్కల భూమి క్రమబద్దీకరణ వల్ల  లక్షా 84 వేల 389 మంది లబ్ధిపొందుతున్నారని తెలిపారు. 100 గజాల వరకు పేదలు ఆక్రమించిన స్థలాన్ని, గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక భూములను క్రమబద్దీకరించామని తెలిపారు. భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలనే  లక్ష్యంతో విశాఖలో ఏర్పాటు చేసిన సిట్ వేగవంతంగా  పనిచేస్తోందని పేర్కొన్నారు. భూ ఆక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో ఆన్‌లైన్‌లో పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు.

------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, విజయనగరం జిల్లాలు ఈ ఏడాది ఉత్తమ పని తీరు కనబరిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన 2017-18 త్రైమాసిక ఫలితాలను విడుదల చేశారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, విజయనగరం జిల్లాలు ఎ++ రేటింగ్ సాధించగా, చిత్తూరు, కర్నూలు, తూర్పు గోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు ఎ+ రేటింగ్‌ను, కడప, విశాఖ, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాలు ఎ గ్రేడ్ సాధించినట్లు ముఖ్యమంత్రి  తెలిపారు.

కాగా, 2015-16 ఆర్థిక సంవత్సరం జి.వి.ఎ.లో వ్యవసాయ రంగంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం మొదటి స్థానం సాధించగా, కలిదిండి మండలం రెండవ స్థానం, నాగాయలంక మండలం పదవ స్థానం సంపాదించాయి. జి.వి.ఎ.లో పారిశ్రామిక రంగంలో విశాఖ జిల్లా గాజువాక మండలం మొదటి స్థానం, విశాఖ అర్బన్ మండలం 2వ స్థానం, విశాఖ జిల్లా పరవాడ మండలం 10వ స్థానంలో నిలిచాయి.

------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం వుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. విజయవాడలో ఈ రోజు జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ, పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో మంచి పురోగతి సాధించామని, అయితే పారిశ్రామిక రంగం ఇంకా మెరుగుపడవలసిన అవసరం ఉందని సూచించారు. వృద్ధి రేటు పరంగా మంచి ఫలితాలు సాధించామని, తలసరి ఆదాయంలో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన  పేర్కొన్నారు.

-----------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ 36వ సంచిక ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. ఈ సంచికతో ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగాలు ప్రారంభించి మూడేళ్ళు పూర్తి అవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి సలహాలు, సూచనలు పంపాలనుకునే వారు నరేంద్రమోడీ యాప్ ద్వారా గానీ, www.mygov.in వెబ్ సైట్ ద్వారా కానీ పంపవచ్చు. అలాగే తమ స్వర సందేశాలు పంపాలనుకునే వారు 1800-11- 7800 అనే టోల్ ఫ్రీ నెంబరుకు హిందీ లేదా ఇంగ్లీషు బాషల్లో పంపవచ్చు. ఈ స్వర సందేశాలను ఈ రోజు సాయంత్రం వరకు పంపవచ్చు. అలాగే 1922 అనే నెంబర్‌కు మిస్ట్ కాల్ ఇవ్వడం ద్వారా తిరిగి మన మొబైల్‌కు వచ్చే సంక్షిప్త సందేశంలోని లింక్ ద్వారా కూడా పంపవచ్చు. ఈ కార్యక్రమ తెలుగు అనువాదం కార్యక్రమం ప్రసారమైన వెంటనే, అనంతరం తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా పునఃప్రసారమవుతుంది.

-----------------------

ఎలక్ట్రానిక్స్, అణు, భౌతిక శాస్త్ర రంగాలలో దేశానికి విశిష్ట సేవలు అందించిన అయ్యగారి సాంబశివరావు జయంతిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈ రోజు ఘనంగా జరుపుకుంటున్నారు. ఎ.ఎస్.రావుగా సుపరిచితులైన అయ్యగారి సాంబశివరావు 1914 సెప్టెంబర్ 20వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు గ్రామంలో జన్మించారు. ఎలక్ట్రానిక్స్, అణు, భౌతిక శాస్త్ర రంగాలలో ఎ.ఎస్.రావు చేసిన నిరుపమాన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మ విభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి భారత ప్రజలు ప్రస్తుతం వినియోగిస్తున్న ఇవిఎంలు తయారు చేస్తున్న ఇసిఐఎల్‌ను ఎ.ఎస్.రావు నెలకొల్పారు.

-----------------------

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని అర్హులైన పాత్రికేయులందరికీ మూడు పడకగదుల ఇళ్ళను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. పట్టణంలోని ఎల్.అగ్రహారంలో నిర్మిస్తున్న ప్రత్యేక టౌన్ షిప్ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం పోలవరం ప్రాజక్ట్ పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రితో పాత్రికేయులకు మూడుపడక గదుల ఇళ్ళ విషయాన్ని చర్చించగా, దీనిపై ముఖ్యమమత్రి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారని తెలిపారు.

-----------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రుణ వితరణ లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చురుగ్గా వ్యవహరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాల రాజు ఆదేశించారు. నిన్న నెలూరులోని కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఆఖరులోగా అన్ని ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయించాలని సూచించారు.

------------------------

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండల కేంద్రంలో వెలసిన కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖల మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు నిన్న ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రజల కొంగు బంగారంగా పిలవబడుతున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు ప్రతిఏటా దసరా ముందు జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఇక్కడ జరిగే ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తలి వస్తారు.

================